
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
కొత్త సీరియల్
మరోమలుపు
దేవినేని ఉష
11-3-'88,18-3-'88
రు. 3-00

## తల్లితండ్రులూ పిల్లల్ని విసుక్కోకండి

"అబ్బబ్బ ఏం విసిగిస్తున్నావురా నాయనా, ఆఫీసు నుంచి ఇప్పుడే ఇంటికొచ్చి, ఇలా విశ్రాంతిగా కాసేపు కూర్చున్నానో లేదో వెధవ ప్రశ్నలతో నా మెదడు తినేస్తున్నావు. వెళ్ళి ఓ మూల కూచుని చదువుకో". కోపంగా తండ్రి తిట్టిన తిట్టుకి బిక్క మొహం వేసుకుని, కళ్ళ నీళ్ళ పర్యంతమవుతూ నిల్చున్నాడు ఏడేళ్ళ గోపి.

సాధారణంగా చిన్న పిల్లలు తమ చుట్టూ వున్న పరిసరాలను శ్రద్ధగా పరిశీలిస్తుంటారు. వారి చిన్న బుర్రలో ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తుంటాయి. ఎన్నెన్నో సమస్యలకి సమాధానాలు తెలుసుకోవాలని ఆరాటపడతారు. తల్లిదండ్రులు వారి సమస్యలు




తెలుసుకుని వారికి సాధ్యమయినంత విపులంగా సమాధానాలు చెప్పాలి. అంతేగాని వారిని విసుక్కుని, కసురుకుని, వారిలోని "తెలుసుకోవాలన్న" ఉత్సాహాన్ని నిరుత్సాహపరిస్తే, వారు తమ సమస్యలను తమలోనే అణగద్రొక్కుకుంటారు. వారి సమస్యలు సమస్యలుగానే వుండిపోయి వారి ఆలోచనా శక్తి మందగించడానికి ఇదో కారణమవుతుంది.

పిల్లల మనసులు ఎంతో సున్నితమయినవి. వారమంతా స్కూలుకెళ్ళి చదువుకుని, ఒక్క రోజు (సెలవు రోజు) మాత్రం ఇంట్లో వుంటారు. ఆ రోజు వారికి స్వతంత్రం దినం. అటువంటప్పుడు తల్లిదండ్రులు వారిని చీటికి మాటికి చివాట్లు పెడితే వారి హృదయాలు కలత చెంది, వారు ఎంతగానో కృంగిపోతారు. ఫలితంగా వారు చదువులో



వెనకబడిపోతారు, కొంతమంది మొండి వాళ్ళుగా కూడా తయారవుతారు.

తల్లితండ్రులు తమపిల్లల పట్ల శ్రద్ధ వహించి, వారిని క్రమశిక్షణతో పెంచి, విజ్ఞానదాయకమయిన పుస్తకాలు చదివిస్తూ, వారికొచ్చే చిన్న సమస్యలకు (వారి పరిధిలో అవి పెద్దవే) సమాధానాలు వివరంగా చెబితే వారి తెలివితేటలు అభివృద్ధిచెంది, మానసికంగాను, శారీరకంగానూ ఆరోగ్యంగా ఎదిగి, అందరి మన్ననలకి పాత్రులవగలుగుతారు.


కనుక తల్లితండ్రులారా దయచేసి, పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకొని, అడుగడుగునా వారికి ఆదరణ ఇచ్చి, ప్రోత్సహించితే తల్లితండ్రులుగా మీ బాధ్యత నెరవేర్చినట్టే!

ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
హైదరాబాద్

* * *

## పక్షపాతం కూడదు

నెల రోజుల క్రితమే మా ప్రక్కింటిలో క్రొత్తగా అద్దెకు చేరారు. చేరినప్పటి నుండి వింటూనే వున్నా వాళ్ళింటిలో రోజూ ఒక పిల్లవాడి ఏడుపు గొంతు. సుమారు పది సంవత్సరము లుంటాయి. ఆ యింటి ఇల్లాలు రోజూ ఆ పిల్లవాణ్ణి ఏదో ఒక సాకుతో కొట్టి తన కసి తీర్చుకుంటుందా! అని అన్పిస్తుంది చూసే వాళ్ళెవరికైనా, కాని మిగిలిన తన యిద్దరు కొడుకులను ఎంతో మురిపంగా చూసుకుంటుంది. చూసారా! తల్లి పక్షపాతం. మరి వాళ్ళు ముగ్గురు తన కడుపు చించుకు పుట్టినవాళ్ళే. మరెందుకు యిలా ప్రవర్తిస్తుందో అర్థం కాలేదు. తండ్రి చూద్దామా అంటే ఉదయం వెళ్ళి సాయంత్రం వచ్చే ఒక ఉద్యోగి. మరి అతనికెలా తెలుస్తుంది యింట్లో జరిగే ఈ కథంతా. రోజూ అలా దెబ్బలుతిని ఎరుపెక్కిన కళ్ళతో, బొంగురుబోయిన గొంతుతో మా యింటి ముందుగల అరుగు మీద కూర్చుని ఏడుస్తుంటే నేను స్కూలుకెళ్తూ ఆ పిల్లవాడి దయనీయ పరిస్థితి చూసి భ్రమించి పోయేవాణ్ని. ఒక వేళ ధైర్యం చేసి వాళ్ళింటికెళ్ళి "ఏమమ్మా! ఆ పిల్లాణ్ని దేనికలా రోజూ వాడి కంపాన పెడుతుంటావ్... నీ కసలు ఆ పసికందుని కొట్టడానికి చేతులెలా వస్తాయి" అని అడుగుదామా అంటే కొత్తవాళ్ళు, మనకు పరిచయంలేరు. పైగా ఎదిరించి అడిగిన తరువాత జవాబు ఏ విధంగా ఉంటుందో. "మా పిల్లవాణ్ని మేం ఏమైనా చేసుకుంటాం మీకెందుకు పోవయ్యా..." అంటే. యిలా ఆలోచించి మళ్ళీ ఆ పిల్లాడి బాధను చూడలేక ఒకసారి రోజులాగే ఆ అరుగుమీద కూర్చుని ఏడుస్తున్న పిల్లాణ్ని సమీపించి "ఏంబాబు ఎందుకిలా రోజూ ఏడుస్తుంటావ్. అసలు ఏ అమ్మ నిన్నెందుకు కొడుతుంది" అని అడిగాను. కాని చెబితే యింకా ఎలా కొడుతుందోనని భయమేమో ఏడ ఏడంగా వెళ్ళి పోతున్నాడు. ఎలాగో లాలించి, ధైర్యం చెప్పి ఏమైనా నా దారిలోకి తెచ్చుకుని అడిగితే "ఏమో... నాకు తెలియదు మా యిద్దరి తమ్ముళ్లను మాత్రం పల్లెత్తు మాటందు, నన్నే యిలా..." అని ఏక్కి ఎక్కి ఏడ్వసాగాడు. నేను ఓదార్చి వాళ్ళ అమ్మ చూడకుండా మా యింటికి తీసుకెళ్ళి ఆ అబ్బాయి ఏడుపుమాన్పించి రెండు బిస్కట్లు ఇచ్చి, అబ్బాయిని రోజూ మా యింటికి వస్తూండు అని చెప్పి పంపాను. పాపం! తల్లి వుండి తండ్రి వుండి యిలా ఎంత మంది ఈ సమాజంలో వారి ప్రేమానురాగాలకు నోచుకోలేక చిన్నప్పట్నుండే మానసికంగా నలిగిపోతున్నారు. అన్నీ వుండి అనాధులుగా బ్రతుకుతున్నారు. పెద్దవాళ్ళైం తరువాత వివాహం చేసుకుని భార్య చూపించు అనురాగానికి లోనై తల్లి దండ్రుల పట్ల విముఖత చూపుతున్నారంటే యిలాంటి విషయాలే కారణమని ఎందుకనుకో



కూడదూ? కన్నతల్లి దగ్గర పొంద వలసిన లాలిత్యాన్ని పరాయి ఇళ్ళల్లో చిన్నప్పట్నుండే పొందాలన్న ఆరాటం. పెద్దయ్యాక ప్రబలి కొంచెం అభిమానించే వార్ని వెదుక్కుంటారు. వీళ్ల అసహాయతను ఆధారం చేసుకుని వలలు విసురుతుంటారు మరి కొందరు.

కాబట్టి తల్లులూ! పిల్లల్ని పక్షపాతంగా చూడకండి- వారి పసి హృదయాల్ని నొప్పించి గాయపర్చ కండి- వారి భవిష్యత్తు పాడు చేయకండి- ప్లీజ్!!

కోలపల్లి, గుత్తికొండ,
నెల్లూరు □

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు: P. V. SUBBARAYUDU,
పూర్తి చిరునామా: H. NO. 8-78, GAUTHAM NAGAR,
P. O. BOWINPALLY,
SECUNDERABAD - (A. P.)